సాక్షి
ఖమ్మం
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



తెల్లవారే 'బార్'లా...

జిల్లాలోని పలు బార్ షాపుల్లో సమయపాలన పాటించకుండా తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు మొలుపెడుతున్నారు. 8లో



దారి తప్పిన 'దళితబంధు'?

దళితుల ఆర్థికాభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లు కొన్ని పక్కదారి పట్టాయనే ఫిర్యాదుతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
40° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఎండలకు తోడు వడ గాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉష్ణోగ్రత గరిష్ఠస్థాయికి చేరుతుంది.



న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి శ్రీనయ్య


శ్రీనయ్య

ఖమ్మంలీగల్: ఖమ్మం మహిళా కోర్టు న్యాయమూర్తిగా నియమితులైన వి.శ్రీనయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లికి చెందిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయవిద్య పూర్తిచేసిన ఆయన 2006 నుంచి 2012 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికై నిజామాబాద్ స్పెషల్ మొబైల్ కోర్టు, రాజేందర్‌నగర్‌లో 11 ఏఎంఎం కోర్టుల్లో విధులు నిర్వర్తించారు. ఆతర్వాత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో న్యాయమూర్తిగా ఎంపిక కావడంతో ఖమ్మం మహిళా కోర్టు జడ్జిగా నియమించారు. ఈసందర్భంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనయ్య మాట్లాడుతూ కక్షిదారులకు సత్వరన్యాయం అందేలా చూస్తానని తెలిపారు. పెండింగ్ కేసులు తగ్గించడమే ధ్యేయంగా పని చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతిలో ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్, ఒకేషనల్ కోర్సుల పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఈమేరకు 896మంది విద్యార్థులకు గాను 877మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు తాను పలు కేంద్రాలను తనిఖీ చేశామని వెల్లడించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం శ్రీలత, డీసీఎస్ఓ చందన్‌కుమార్ తదితరులు

ఖమ్మం సహకారనగర్/సత్తుపల్లి టౌన్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈసందర్భంగా సోమవారం 153 కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగిలో ధాన్యం సాగు చేసిన రైతులు ఆయా కేంద్రాలకు తీసుకెళ్లి మద్దతు ధర పొందాలని సూచించారు. కాగా, సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారం, నారాయణపురం సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి వి.మురళీధర్‌రావు, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, జిల్లా మేనేజర్ శ్రీలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అన్వర్, ఏఈఓ ఆశాజ్యోతితో పాటు వీరస్వామి, వెంకటేశ్వరరావు, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లిస్తే రాయితీ

- 'ఎర్లీ బర్డ్' ద్వారా 30వ తేదీ వరకు అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలోనే సాధ్యమైనంత మేర ఆస్తిపన్ను రాబట్టేలా అధికారులు ఏటా మాదిరిగా ఎర్లీ బర్డ్ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదుశాతం రాయితీ లభించనుంది. ఉన్నతాధికారులు ఈ పథకాన్ని ప్రారంభించగా.. అధికారులు ఆర్థిక సంవత్సరం ప్రారంభం మొదటి రోజు నుండే పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు కాకుండా ముందుగానే పన్నులు రాబట్టాలని.. తద్వారా ఖజానాను పరిపుష్టి చేయాలనే ఉద్దేశంతో కొన్నాళ్లుగా ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలుచేస్తున్నారు. ఈ మేరకు ఎక్కువ మంది పన్నులు చెల్లించేలా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. 2023–24 ఏడాదిలో ఆస్తి పన్ను మొత్తం చెల్లించిన వారు.. ఇప్పుడు 2024–25కు సంబంధించి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ లభించనుంది.

లక్ష్యసాధనలో మేటి

- పన్నుల వసూళ్లలో పలు శాఖల ముందంజ
- మార్కెటింగ్, మైనింగ్ శాఖల్లో లక్ష్యానికి మించి ఆదాయం
- కేఎంసీలోనూ అత్యధికంగా పన్నుల వసూళ్లు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

మార్కెటింగ్ శాఖ భేష్

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి ఆదాయం నమోదైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఎని మిది మార్కెట్ల ద్వారా ఆదాయ లక్ష్యం రూ.5,439.72 లక్షలు కాగా రూ.5,780.70 లక్షలు వసూలయ్యాయి. ఇందులో అత్యధికంగా ఖమ్మం మార్కెట్ నుంచి రూ.2,614 లక్షలకు రూ.2,761 లక్షలు వసూలయ్యాయి. అలాగే, వైరా మార్కెట్ రూ.472.01 లక్షలకు రూ.578.59లక్షలు, కల్లూరు మార్కెట్ రూ.417.19 లక్షలకు గాను రూ.484.25లక్షలు, సత్తుపల్లి మార్కెట్ రూ.375లక్షలకు గాను రూ.478.37 లక్షలు, మధిర మార్కెట్ పరిధిలో రూ.434.24 లక్షలకు రూ.455.03లక్షలు, ఏన్కూరులో రూ.414.12 లక్షలకు గాను రూ.449.99లక్షల ఆదాయం నమోదైంది. ఇవన్నీ లక్ష్యానికి మించి ఆదాయాన్ని సాధించాయి. కానీ మద్దులపల్లి, నేలకొండపల్లి మార్కెట్లు మాత్రం లక్ష్యసాధనలో చతికిల పడ్డాయి. ఇందులో నేలకొండపల్లి మార్కెట్‌కు రూ.405.16 లక్షల్లో రూ.391.08లక్షలు, మద్దులపల్లికి రూ.308.00 లక్షల ఆదాయానికి గాను రూ.182.39లక్షల ఆదాయమే నమోదైంది. మొత్తంగా పరిశీలిస్తే గత ఏడాదితో పోలిస్తే మార్కెటింగ్ శాఖకు రూ.8 లక్షల మేర ఆదాయం పెరిగిందని అధికారులు వెల్లడించారు.

'మైనింగ్' ఆదాయం ఫుల్...


ఖమ్మం రూరల్ మండలంలోని క్వారీ

ఖమ్మంఅర్బన్: జిల్లాలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో మైనింగ్ శాఖ ద్వారా పుష్కలమైన ఆదాయం లభించింది. లక్ష్యాన్ని మించి ఆదాయం సాధించి వసూళ్లలో అగ్రభాగాన నిలిచింది. జిల్లాలో మైనింగ్ శాఖ ద్వారా గ్రానైట్, మట్టి క్వారీల లీజ్, గ్రానైట్ పరిశ్రమల నుంచి పన్నులు తదితరాలు కలిపి రూ.80.17కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా.. సోమవారం ఉదయానికి అందిన సమాచారం ప్రకారం రూ.92కోట్లు(115 శాతం) వసూలయ్యాయి. అయితే, లీజ్ ఫీజు, ప్రభుత్వ అవసరాలకు మట్టి తీసుకెళ్లిన కాంట్రాక్టర్ల నుంచి సేకరించిన బిల్లులను ట్రెజరీ ద్వారా జమ చేస్తారు. ఈ లెక్కలు కూడా తేలితే ఆదాయం మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. జిల్లాలో 400 పైగా గ్రానైట్ పరిశ్రమలు ఉండగా.. వీటికి ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, ముదిగొండ, నేలకొండపల్లి తదితర ప్రాంతాల్లో క్వారీల నుంచి రాయి తరలిస్తారు. అలాగే, పక్క జిల్లాల నుంచి కూడా గ్రానైట్ తీసుకొస్తారు. ఇవేకాక జిల్లాలో బైరటీస్ తదితర క్వారీలూ ఉన్నాయి. ఇంకా సింగరేణి బొగ్గు గనులు కూడా ఉండడంతో ఆదాయం భారీగా నమోదైంది.



ఖమ్మం మున్సిపల్ కార్యాలయం

కేఎంసీ ఆదాయం రూ.35.37 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)కు పన్నుల ద్వారా భారీగానే ఆదాయం సమకూరింది. ఆస్తి , పంపు పన్నులే కాక ట్రేడ్‌లైసెన్సు ఫీజుల రూపంలో మొత్తం రూ.35.37 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో జీహెచ్ఎంసీ తర్వాత అత్యధిక ఆదాయం పొందిన కార్పొరేషన్‌గా ఖమ్మం నిలిచింది. కేఎంసీ పరిధిలో ఆస్తి పన్నుల లక్ష్యం రూ.32.87 కోట్లకు గాను రూ.30.81 కోట్లు వసూలు చేశారు. అలాగే, నల్లా పన్నుల లక్ష్యం రూ.9.20 కోట్లు కాగా.. రూ.3.40 కోట్లు రాబట్టారు. ఇక ట్రేడ్ లైసెన్సుల ఫీజు రూ.1.80 కోట్లలో రూ.1.10 కోట్లు వసూలయ్యాయి. 2022–23లో కేఎంసీకి పన్నుల రూపంలో రూ.29.80 కోట్లు ఆదాయం సమకూరగా, ఈసారి రూ.35.37 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలో అమలుచేసిన ఎర్లీ బర్డ్ ద్వారా ఎక్కువ మంది పన్ను చెల్లించేలా కమిషనర్ ఆదర్శ్ సురభి నేతృత్వాన అధికారులు కృషి చేయగా ఏప్రిల్‌లోనే రూ.9కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైంది. కాగా, ఈ ఏడాది కూడా ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలుచేస్తున్నందున ఇదేనెల మళ్లీ రూ.9 కోట్ల మేర వసూలు చేయాలని అధికారులతో సోమవారం సమావేశమైన ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి దిశా నిర్దేశం చేశారు.

విధులపై అవగాహన అవసరం

ఎన్నికల శిక్షణలో కలెక్టర్ గౌతమ్


శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: పోలింగ్ రోజు విధులు, బాధ్యతలపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలల్లో ఐదు నియోజకవర్గాల అధికారులకు సోమవారం శిక్షణ ఇవ్వగా, కలెక్టర్ మాట్లాడారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన పెంపొందించుకుని మాక్ పోలింగ్ మొదలు ఎన్నిక పూర్తయ్యే వరకు జాగ్రత్త వ్యవహరించాలని తెలిపారు. ఇక ఎన్నికల విధుల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, మాస్టర్ ట్రెయినీ కె.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు 9,972మంది సిబ్బంది

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఉద్యోగులకు కేటాయింపు కొలిక్కి వస్తోంది. ఈ నియోజకవర్గం పరిధిలో జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 1,456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఇందులో విధులు నిర్వర్తించేందుకు 7,280మంది ఉద్యోగులు అవసరం ఉండగా... అదనంగా 20శాతం మందితో కలిపి 9,972మందికి శిక్షణ ఇస్తున్నారు. కాగా, గతంలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ ఆఫీసర్(పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్(ఓపీఓ) మాత్రమే విధులు నిర్వర్తించే వారు కానీ ఈసారి ఐదుగురిని కేటాయిస్తున్నట్లు తెలిసింది.

ప్రణాళికాయుతంగా తాగునీటి సరఫరా

రానున్న రెండు నెలల పాటు ప్రణాళికాయుతంగా తాగునీటి సరఫరా చేస్తూ ప్రజలకు ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆమె సోమవారం తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో వసతుల కల్పనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వేసవిలో తాగునీటి ఇక్కట్లు ఎదురుకాకుండా పర్యవేక్షించాలని, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్ల వినియోగం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల్లో మరమ్మతులపై సూచనలు చేశారు. ఈ వీసీకి నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు 7న పరీక్ష

భద్రాచలంటౌన్: వరంగల్ జిల్లా అశోక్‌నగర్‌లో ని తెలంగాణ గిరిజన సంక్షేమ ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్ ఎంపీసీలో ప్రవేశాలకు ఈనెల 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులకు ఖమ్మంలోని ప్రతిభా కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈనెల 7న ఉదయం 9నుంచి 12 గంటల వరకు 6వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని పీఓ సూచించారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారి మూలమూర్తులను ముత్యాల వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎండిన పంటలపై ప్రభుత్వం ఆరా

- జిల్లాలో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న
- నష్టపరిహారంపై రైతుల్లో ఆశలు

ఖమ్మంవ్యవసాయం: సాగునీటి సమస్య కారణంగా ఎండిపోయిన యాసంగి పంటలపై ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఇక మార్చి మూడోవారంలో ద్రోణి కారణంగా సంభవించిన ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఇతర జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో స్పందించిన ప్రభుత్వం పంట నష్టాన్ని గుర్తించాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. అటు అకాల వర్షాలు, ఇటు సాగునీటి సమస్యతో ఎండిన పంటలపై నివేదిక ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు సర్వే చేస్తున్నారు.

మధిర వ్యవసాయ డివిజన్‌లో సర్వే

జిల్లాలో జలాశయాల్లో నీరు లేకపోగా, భూగర్భ జలాల ఆధారంగా పంటలు సాగుచేసినా ప్రస్తుత పరిస్థితుల్లో నీరు అందక వేలాది ఎకరాల్లో ఎండిపోతున్నాయి. ఈ ఏడాది యాసంగిలో జిల్లాలో మొత్తం 1,83,652.33 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా.. ఇందులో ప్రధానంగా వరి 1,05,335.05 ఎకరాల్లో, మొక్కజొన్న 64,683.99 ఎకరాల్లో సాగైంది. అయితే, నాగార్జునసాగర్ చివరి ఆయకట్టుగా ఉన్న మధిర వ్యవసాయ డివిజన్‌లోని బోనకల్, ముదిగొండ మండలాల్లో వరి 1,009 ఎకరాల్లో, మొక్కజొన్న 2,113 ఎకరాల్లో ఎండిపోయినట్లు వ్యవసాయ శాఖ ఇప్పటికే గుర్తించింది. కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లో నేలకొండపల్లి మండలంతో పాటు తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో, వైరా డివిజన్‌లోని కొణిజర్ల, వైరా తదితర మండలాల్లో మొక్కజొన్న, అక్కడక్కడ వరి పంటకు నష్టం జరిగిందని గుర్తించారు. ఇక సత్తుపల్లి వ్యవసాయ డివిజన్‌లోనూ తల్లాడ, కల్లూరు మండలాల్లో వరి ఎండిపోయినట్లు సమాచారం. అకాల వర్షాలతో పంటలకు నష్టం జరిగితే ఎకరాకు రూ.10 వేల మేర పరిహారం చెల్లించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే, ఎండిన పంటలపై స్పష్టత ఇవ్వకున్నా అధికారులు వివరాలు తీస్తుండడంతో రైతుల్లో పరిహారం ఆశలు చిగురిస్తున్నాయి. ఈవిషయమై జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మలను సంప్రదించగా.. ఎండిన పంటల వివరాలు సేకరించినట్లు నిర్ధారించారు.

సాగర్ జలాలు విడుదల

- మూడు రోజుల్లో పాలేరుకు చేరనున్న నీరు
- తీరనున్న జిల్లా ప్రజల దాహార్తి


వెలవెలబోతున్న పాలేరు రిజర్వాయర్

కూసుమంచి: జిల్లా వాసుల దాహార్తి తీర్చేలా నాగార్జునసాగర్ డ్యాం నుండి నీటిని సోమవారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. ఈ నీరు మూడు రోజుల్లోగా పాలేరు రిజర్వాయర్‌కు చేరుతుందని భావిస్తున్నారు. వాస్తవానికి 36గంటల్లోనే నీరు చేరాల్సి ఉన్నా తొలుత నల్లగొండ జిల్లాలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నింపాలని నిర్ణయించారు. అక్కడి నుంచి పాలేరుకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

కనిష్టస్థాయికి నీటిమట్టం

పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం ఆరు అడుగులకు పడిపోయింది. దీంతో ప్రధానంగా ఖమ్మం నగర వాసులకు తాగునీటి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అలాగే, పాలేరు నుండి మిషన్ భగీరథ, ఇతర ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని 2,439 గ్రామాల్లో 19.47 లక్షల మందికి రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, పాలేరు నీటిమట్టం పడిపోవటంతో అధికారులు కాల్వలు తవ్వించి తాగునీటి ప్రాజెక్టులకు నీరందిస్తున్నారు. ఈనేపథ్యాన జిల్లాకు చెందిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సాగర్ నీటి కోసం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించడంతో సాగర్ జలాలను విడుదల చేశారు. డ్యాం నుండి తొలుత వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేయగా దాన్ని క్రమంగా మరింత పెంచనున్నారు. తద్వారా పాలేరు నింపుతూ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేర్చి తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. ఈ వేసవిలో తాగునీటి అవసరాల నిమిత్తం జిల్లాకు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయాలని ప్రతిపాదించగా.. తొలిదశలో 1.5 టీఎంసీలు చేరే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. కాగా, వేసవి ముదురుతున్న వేళ సాగర్ జలాలు విడుదల చేయటంతో తాగునీటి సమస్యకు ఊరట లభించినట్లయింది.

చంద్రాయపాలెంలో టెన్షన్.. టెన్షన్


భూములు తమవేనని చెబుతున్న చంద్రాయపాలెం గిరిజనులు


పాస్‌పుస్తకాలు ఉన్నాయంటున్న బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గిరిజనులు

- పోలీసులపై దాడితో పికెట్ ఏర్పాటు
- సామ్యేలు, మహేంద్ర సహా పలువురిపై హత్యాయత్నం కేసులు
- భూవివాదం తేల్చాల్సిందెవరన్న అంశంపై అస్పష్టత
- వరుస అరెస్టులతో గిరిజనుల్లో భయం

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో పోడు భూముల వివాదం శాంతిభద్రతల సమస్యగా మారింది. ఈ గ్రామంలో సర్వే నంబర్ 343 నుంచి 359 వరకు విస్తరించి ఉన్న 400 హెక్టార్ల భూమిపై హక్కు కోసం స్థానిక, స్థానికేతర గిరిజనులు ఆదివారం గొడవ పడుతుండగా అడ్డుకునేందుకు వెళ్లిన సీఐ కిరణ్, సిబ్బందిపై దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటనతో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్ సోమవారం కూడా కొనసాగగా పోలీసులపై దాడిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న గిరిజనులను గుర్తించి అరెస్ట్ చేస్తున్నారు. ఆదివారం రాత్రే 20మంది గిరిజన మహిళలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు ఐదు కేసులు నమోదు చేయగా, మద్దిశెట్టి సామేలు, కూరం మహేంద్రతో పాటు ఇంకొందరిపై కేసుల్లో హత్యాయత్నం సెక్షన్లు కూడా చేర్చినట్లు ఏసీపీ అనిశెట్టి రఘు తెలిపారు. ఇక సోమవారం మద్దిశెట్టి సామ్యేలు, మహేంద్ర సహా 26మందిని అరెస్ట్ చేయగా ఇప్పటివరకు 46మందిని అరెస్ట్ చేసినట్లయింది.

15 ఏళ్ల నుంచి ..

చంద్రాయపాలెం గిరిజనులకు బుగ్గపాడు, రుద్రాక్షపల్లి, నాగుపల్లి గ్రామాల గిరిజనుల నడుమ ఈ భూమిపై 15 ఏళ్ల నుంచి వివాదం నడుస్తోంది. అయినా అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడంతోనే గొడవ జటిలమైంది. చంద్రాయపాలెం గిరిజనులతో కలిసి 400 హెక్టార్లలో వీఎస్ఎస్ – అటవీ శాఖ సంయుక్తంగాజామాయిల్ సాగు చేస్తుండగా సుమారు 9 హెక్టార్లలో జామాయిల్ కట్ చేసి తిరిగి ప్లాంటేషన్‌కు సిద్ధమవుతుండడంతో వివాదం తీవ్రమైంది. అటవీ శాఖ అధికారులు చంద్రాయపాలెం గిరిజనులను ముందుపెట్టి సమస్యను వారే తేల్చుకోవాలన్నట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. భూమిపై తమకే హక్కులు ఉన్నాయని చంద్రాయపాలెం గిరిజనులు వాదిస్తున్నారు. అయితే 1970 కంటే పూర్వం తమ తాతముత్తాతలు సాగు చేసినట్లు హక్కు పత్రాలు ఉన్నాయని స్థానికేతర గిరిజనులు చెబుతున్నారు. ఏదిఏమైనా రెండు శాఖల సమన్వయంతో పోడు వివాదం తీవ్రమైందని విమర్శలు వస్తున్నాయి.

అధికారులు ఏమన్నారంటే...

చంద్రాయపాలెం 400 హెక్టార్ల భూమి ముమ్మాటీకి అటవీ శాఖదేనని రేంజర్ స్నేహలత తెలిపారు. వీఎస్ఎస్–అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యాన 9 హెక్టార్లలో జామాయిల్ కటింగ్ పూర్తయిందని, ఈసారి అటవీ శాఖ ఆధ్వర్యంలో మారుజాతి మొక్కలను పెంచేందుకు భూమి చదును చేశామన్నారు. ఈ విషయంలో చంద్రాయపాలెం గిరిజనులకు కానీ ఇతర ప్రాంత గిరిజనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇదేవిషయమై సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వరరావు స్పందిస్తూ చంద్రాయపాలెంలోని అటవీ భూమికి రెవెన్యూ శాఖతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. భూవివాదాలను అటవీ శాఖతో కలిసి పరిష్కరించుకోవాలే తప్ప జాయింట్ సర్వే నిర్వహించలేదని స్పష్టం చేశారు.

ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నేరెళ్ల


అధ్యక్షుడిగా గెలిచిన శ్రీనివాసరావుతో నూతన కార్యవర్గం

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నేరెళ్ల శ్రీనివాసరావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. గత నెల 28న ఎన్నికలు నిర్వహించగా 946 మందిలో 757 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే, అదేరోజు ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించాల్సి ఉన్నా తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాలతో నిలిపేశారు. తాజాగా అందిన సూచనలతో సోమవారం మధ్యాహ్నం ఓట్లు లెక్కించిన ఎన్నికల అధికారులు ఫలితం ప్రకటించారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా నేరెళ్ల శ్రీనివాసరావు తన సమీప ప్రత్యర్థి కన్నెబోయిన నాగేశ్వరరావుపై 352ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా చింతనిప్పు వెంకటేశ్వరరావు 289 ఓట్ల మెజార్టీతో, గ్రంథాలయ కార్యదర్శిగా కన్నెగంటి గోపి 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇక ఉపాధ్యక్షుడిగా కె.ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కండే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎజ్జ గాని శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తస్నీరు లలిత గతంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్‌రాజు, రాయల పావెల్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్ కార్యవర్గాన్ని అభినందించారు.

క్లుప్తంగా

వేగ జ్యూయలర్స్ వార్షికోత్సవ లక్కీ డ్రా



విజేతలతో వేగ జ్యూయలరీ యాజమాన్యం

ఖమ్మంగాంధీచౌక్: విజయవాడ లబ్బీపేటలోని వేగ జ్యూయలర్స్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం లక్కీ డ్రా నిర్వహించారు. మార్చి 1నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా ఆ సమయంలో ఆభరణాలు కొనుగోలు చేసి వారి నుంచి విజేతలను ఎంపిక చేసినట్లు సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. లక్కీ డ్రాలో డైమండ్ నెక్లెస్‌లను విజయవాడకు చెందిన వసంత ఆదిశేషమ్మ, ఎస్.రోహిణి, గుంటూరుకు చెందిన వి.వెంకటరమణలు గెలుపొందారు. కాగా, ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు కూడా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని అధినేతలు వనమా నవీన్, సుధాకర్ తెలిపారు. ఏప్రిల్‌లో బంగారం కొనుగోలుపై ప్రతీ గ్రాముకు రూ.250, పాత బంగారం మార్పిడిపై అదనంగా రూ. 50 తగ్గించడమే కాక డైమండ్ జ్యూయెలరీ క్యారట్ రూ.54,000కు ఇస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, పోల్కీ జ్యూయెలరీపై ఎలాంటి తయారీ,, తరుగు చార్జీలు ఉండవని తెలిపారు.

నేడు ఖమ్మంలో 5కే రన్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం 5కే రన్ నిర్వహించనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు జరిగే ర్యాలీని ఉదయం 6గంటలకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రారంభిస్తారు. ఇందులో ఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొననుండగా యువత, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు ఇల్లెందులో కాంగ్రెస్ సమావేశం

ఖమ్మంవన్‌టౌన్: మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశాన్ని మంగళవారం ఇల్లెందులో నిర్వహించనున్నారు. ఉదయం 10.30గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌తో పాటు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఐదు జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, ముఖ్యనాయకులు హాజరుకానున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

మధిర: పట్టణంలో చెరుకుమల్లి వారి వీధిలో నివాసముంటున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మంగళగిరి మధుసూదన్‌రావు ఇంట్లో జరిగింది. ఆయన కుటుంబంతో సహా పది రోజుల క్రితం ఊరు వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో లోపల పరిశీలించగా బీరువా సైతం పగులగొట్టి అందులో భద్రపర్చిన నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఈ మేరకు బాధిత కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రైళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



అరెస్ట్ చేసిన నిందితుడితో జీఆర్పీ పోలీసులు

ఖమ్మంక్రైం: రైళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఖమ్మం జీఆర్పీపోలీసులు సోమవారం అరెస్ట్ చేసారు. ఈసందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వరకుమార్, పోలేపల్లికి చెందిన ఉమేష్ కలిసి కొంతకాలంగా రైళ్లల్లో చోరీలు చేస్తున్నారు. ఈక్రమంలో డోర్నకల్ ఎస్ఐ సురేష్ ఆధ్వర్యాన అక్కడి రైల్వే స్టేషన్‌లో సోమవారం తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకునే యత్నంలో ఉమేష్ పారిపోయాడు. ఇక వరకుమార్ పట్టుబడగా విచారించడంతో చోరీల వ్యవహారం వెలుగుచూసింది. ఆయన నుంచి ఐదు తులాల బంగారం స్వాధీనం చేసుకుని, పారిపోయిన ఉమేష్ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,050	5,150
కందులు	9,600	5,600
మినుములు	8,000	8,000
అలసంద	7,500	7,500
మిర్చి	19,500	11,000
తాలు మిర్చి	10,000	7,800
పత్తి	7,300	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,171



ఖమ్మంలోని వెంకటగిరి క్రాస్ వద్ద ఉదయం 7గంటలకు కొద్దిమేర తెరిచిన బార్



ఉదయం 10గంటలకు మొత్తం షట్టర్లు తెరిచిన దృశ్యం

తెల్లవారే బార్‌లా...

సమయపాలన పాటించని బార్ల యజమానులు

- ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మకాలు
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టింపు లేని వైనం
- పాన్‌షాపుల్లోనూ మద్యం విక్రయాలు
- అయినా చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ



ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద బార్‌లో ఉదయం 7గంటలకు ఓవైపు తెరిచిన డోర్

ఖమ్మంక్రైం: జిల్లాలోని పలువురు బార్లు, వైన్స్‌ల యజమానులు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఎక్సైజ్ శాఖ విధించిన సమయం తమకేమీ పట్టదన్నట్లుగా ఇష్టారాజ్యంగా తెరిచి అమ్మకాలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల బార్లకు అనుబంధంగా తినుబండారాలు దుకాణాలు ఏర్పాటుచేశారు. ఇందులోని సామగ్రిని బార్లలో భద్రపరిచి వాటిని తీసే నెపంతో తెల్లవారుజామున బార్లు తెరుస్తున్నారు. ఆపై యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తుండగా.. ప్రధాన రహదారుల వెంట వైన్స్‌ల్లోనూ ఇలా జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

తెల్లారితే చాలు..

ఎక్సైజ్ నిబంధనల మేరకు ఉదయం 10నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్స్‌ల్లో, ఉదయం 10నుంచి రాత్రి 12గంటల వరకు బార్ల నిర్వహణకు అనుమతి ఉంది. కానీ కొన్నిచోట్ల బార్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉదయం 7గంటలకే బార్ తెరిచి మద్యం అమ్మకాలు మొదలుపెడుతున్నారు. దీంతో మందుబాబులు మద్యం సేవించి ఘర్షణలకు దిగడం పరిపాటిగా మారింది. కొద్దినెలల క్రితం ఖమ్మం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ బార్‌లో అర్ధరాత్రి దాటాక కూడా మద్యం అమ్ముతుండగా చేరుకున్న అల్లరి మూకలు మద్యం మత్తులో గొడవకు దిగి కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు అటు ఎక్సైజ్, అటు పోలీస్ శాఖ కానీ స్పందించకపోవడంతో సదరు బార్ యాజమాన్యం 24గంటలు మద్యం విక్రయాలు చేపడుతోందని తెలిసింది.

ఎక్కడ పడితే అక్కడే

ఇటీవల మద్యం విక్రయాలకు పాన్ డబ్బాలు అడ్డాలుగా మారినట్లు తెలుస్తోంది. కొందరు వైన్ షాపుల యజమానులు సమయం ప్రకారం షాపులు మూసివేసి.. ఆ తర్వాత పాన్‌షాపుల్లోకి చేర్చిన సరుకును అర్ధరాత్రి వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఇటీవల డ్రై డే రోజున ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఓ పాన్‌షాపులో మద్యం పట్టుబడడమే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు.

కోడ్ అమల్లో ఉన్నా...

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అయినా బార్లు, వైన్స్ యజమానులు తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటిచండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, కొందరికి ఎక్సైజ్ ఉద్యోగుల సహకారంతో ఉండడంతోనే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించకపోతే రోజంతా మద్యం అమ్ముతూ పేదల ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసే ప్రమాదముంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వైన్స్, బార్ల యజమానులు నిబంధనల మేరకే అమ్మకాలు కొనసాగించాలి. అలాకాకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతాం.

– నాగేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



పంట నష్టపోయిన రైతుతో మాట్లాడుతున్న ఎంపీ నామా, ఎమ్మెల్సీ

కొణిజర్ల: వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరతతో పంటలు ఎండిపోయినందున రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొణిజర్ల మండలం తీగలబంజర సమీపంలో ఎండిపోయిన మొక్కజొన్న పంటలను సోమవారం ఆయన ఆయన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహనా రాహిత్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో తాగు, సాగు నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని ప్రభుత్వం పరిహారం ప్రకటించాలన్నారు. అనంతరం తీగలబంజరలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నామా మాట్లాడుతూ ఖమ్మం ఎంపీగా మరోమారు పోటీ చేస్తున్న తనను గెలిపించాలని, ఇందుకోసం కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేయాలని కోరారు. ఆతర్వాత సీనియర్ నాయకుడు పోట్ల శ్రీనివాసరావును పరామర్శించారు. జెడ్పీటీసీ పోట్ల కవిత, నాయకులు బోడపోతుల వెంకటేశ్వర్లు, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నిర్లక్ష్యంతోనే కరువు...

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: బీఆర్‌ఎస్ పార్టీ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వ చెబుతూ కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదన్నారు. రబీ సీజన్ ముగింపు దశకు చేరిన సమయాన పంటలు ఎండిపోయాయని అనడం గర్హనీయమని తెలిపారు. పాలేరు జలాశయం అడుగంటడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కాళేశ్వరం తప్ప ఇతర ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ మాట్లాడగా నాయకులు రాయల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, మూడుముంతల గంగరాజు, పెండ్ర అంజయ్య, గడ్డం వెంకటయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

ఖమ్మం సహకారనగర్: తల్లాడ మండలంలోని మల్సూర్‌తండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణపై సస్పెండ్ వేటు పడింది. పాఠశాల ఆవరణలో అనుమతి లేకుండా గ్రామపంచాయతీ భవనం నిర్మించడంతో హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఈ నేపథ్యాన ఆమెను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

'నవోదయ' ఫలితాలు విడుదల

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు జనవరి 20న పరీక్ష నిర్వహించగా, సోమవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఫలితాలను వెల్లడించారు. ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 3,140 మంది విద్యార్థుల్లో 2,492 మంది హాజరయ్యారు.

అర్హత సాధించిన విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లు..

ఎం 3462774, ఎం 3464573, కే 3464588, ఓ 3464750, ఎస్ 3462849
ఎఫ్ 3463104, జే 3463221, జే 3464177, జే 3464480, కే 3462142
జే 3464496, కే 3464620, ఎల్ 3464966, జే 3465050, ఎల్ 3465195
ఎల్ 3464775, ఎల్ 3464838, ఎల్ 3464965, పీ 3465075, ఎల్ 3465127
ఎల్ 3462143, ఐ 3462379, జే 3462529, జే 3462718, ఓ 3462740
జే 3462764, జే 3463111, జే 3463140, జే 3463388, జే 3464182
ఎల్ 3464272, కే 3464446, జే 3464495, ఎస్ 3464557, జే 3464699
కే 3464856, ఎస్ 3465068, జే 3465101, ఎస్ 3465144, జే 3462951
జే 3462953, జే 3463151, జే 3463444, జే 3463941, ఎస్ 3464376
జే 3464622, ఎస్ 3464634, జే 3464637, ఎస్ 3464677, ఎస్ 3464679
జే 3464702, జే 3464711, జే 3464746, ఎస్ 3464778, ఎస్ 3464780
ఓ 3462703, ఓ 3462860, కే 3462930, కే 3462966, కే 3463277
కే 3463446, ఓ 3463500, ఓ 3463594, ఓ 3464417, ఓ 3464825
పీ 3462134, పీ 3462208, ఎల్ 3462229, పీ 3462372, పీ 3462730
ఎల్ 3462796, ఎల్ 3463236, పీ 3463518, ఎల్ 3463922, పీ 3464298
పీ 3464362, ఎల్ 3464770, పీ 3464873, ఎల్ 3465201, ఎల్ 3465205

గంజాయి రవాణా కేసులో నలుగురికి 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: గంజాయి రవాణా కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 సెప్టెంబర్ 29న ఖమ్మం రూరల్ పోలీసులు కోదాడ క్రాస్ రోడ్డులో తనిఖీ చేస్తుండగా రెండు వాహనాల్లో తీసుకెళ్తున్న 170.190 కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితులైన బొబ్బిలి సాయి, టి.వెంకటసత్యనారాయణ, గుంజి వెంకటరావు, గంధసిరి నాగరాజుతో పాటు ఇంకొకరిని అరెస్ట్ చేశారు. అయితే, ఓ నిందితుడు పరారీలో ఉండగా.. మిగతా నలుగురిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కొత్తా వెంకటేశ్వర్లు వాదించగా, సిబ్బంది కె.తిరుమలరావు, భద్రునాయక్, శ్రీనివాసరావు, ఎండీ.అయూబ్ సహకరించారు.

దారి తప్పిన దళితబంధు?

- చేయి దాటిన పలువురి యూనిట్లు
- లబ్ధిదారులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- చింతకాని మండల పర్యటనలో గుర్తించిన కలెక్టర్
- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన యంత్రాంగం



దళితబంధు కింద కొనుగోలు చేసిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)

చింతకాని: దళితుల అభ్యున్నతి కోసం గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అధికారుల పర్యవేక్షణ లోపంతో పక్కదారి పట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. దళితులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారి హుజురాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. అనంతరం 2021 సెప్టెంబర్ 1న మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేయగా.. ఆసక్తి ఉన్న యూనిట్ ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నది లక్ష్యం. ఈమేరకు చింతకాని మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించాక అర్హులను గుర్తించేందుకు ప్రతీ గ్రామపంచాయతీకి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు.

3,462 మంది లబ్ధిదారులు

దళితబంధు పథకానికి మండల వ్యాప్తంగా 3,462 మంది అర్హులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆపై వారికి ఆసక్తి యూనిట్లను గ్రౌండింగ్ చేశారు. ఎక్కువ మంది డెయిరీ యూనిట్లు, జేసీబీలు, హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, గూడ్స్ కారియర్స్ ఎంచుకున్నారు. మండలంలో అత్యధికంగా 575 డెయిరీ యూనిట్లు ఏర్పాటుచేయగా, 499 మంది జేసీబీలు, 367మంది గూడ్స్ కారియర్ వాహనాలు, 345మంది ట్రాక్టర్లు, 271 మంది హార్వెస్టర్లు కొనుగోలు చేశారు. అలాగే, కార్లు, ఇతర రవాణా వాహనాలు 250 యూనిట్లు, గొర్రెల యూనిట్లు 213 గ్రౌండింగ్ అయ్యాయి.

పర్యవేక్షణ ఓపంతో...

చింతకాని మండలాన్ని దళితబంధు పథకానికి పైలట్‌గా ఎంపిక చేయగా.. కలెక్టర్ గౌతమ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తరచుగా మండలంలో పర్యటించిన లబ్ధిదారులకు లబ్ధి జరిగేలా యూనిట్ల ఎంపికపై అవగాహన కల్పించారు. అలాగే, ప్రతీ వారం పంచాయతీ కార్యదర్శుల యూనిట్ల తనిఖీ చేయించారు. కానీ బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోగా.. ప్రస్తుత ప్రభుత్వం దళితబంధుపై స్పష్టత ఇవ్వలేదు. ఇంతలోనే అధికారుల పర్యవేక్షణ కూడా కొరవవగా.. పలువురు లబ్ధిదారులు దళితబంధు యూనిట్లను అమ్ముకున్నారని తెలుస్తోంది. గతంలోనే గేదెలు, గొర్రెల యూనిట్లను అమ్మిన లబ్ధిదారులను గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఆపై ట్రాక్టర్లు, జేసీబీలు, గూడ్స్ కారియర్ వాహనాలు, హార్వెస్టర్లు, సెంట్రింగ్ యూనిట్లను కూడా అమ్మినట్లు తెలుస్తుంది.

కలెక్టర్ ఆదేశాలతో విచారణ

కలెక్టర్ గౌతమ్ మార్చి 30వ తేదీన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దళితబంధు కింద మంజూరైన యూనిట్లపై ఆరా తీయగా.. చాలామంది అమ్ముకున్నట్లు పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన దళితబంధు యూనిట్ల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ రామయ్యను ఆదేశించారు. ఈమేరకు సోమవారం నుంచి విచారణ ప్రారంభించామని ఎంపీడీఓ తెలిపారు. దళితబంధు ద్వారా మంజూరైన యూనిట్లపై ఆరా తీసి, అమ్ముకున్న వారికి నోటీసులను ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో తనిఖీలు పూర్తయ్యాక కలెక్టర్ నివేదిక ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు.

బేడా బుడగ జంగం మహిళా అధ్యక్షురాలిగా చంద్రకళ



మాట్లాడుతున్న అధ్యక్షురాలు చంద్రకళ

ఖమ్మంమామిళ్లగూడెం: బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి మహిళా విభాగం అధ్యక్షురాలిగా గందోడి చంద్రకళ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మంలో సోమవారం చైర్మన్ సహదేవ రాజు ఆధ్వర్యాన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తొలుత సహదేవరాజును సన్మానించగా మహిళా అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడారు. సంఘం పటిష్టతకు పాటుపడుతూనే సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గంధసిరి గ్రామ అధ్యక్షుడిగా పస్తం కోటయ్య, ఉపాధ్యక్షుడిగా పస్తం భద్రయ్య, కార్యదర్శిగా పస్తం భాస్కర్, సహాయ కార్యదర్శిగా కిన్నెర రెడ్డయ్య, కోశాధికారిగా మిరియాల లక్ష్మీరాంను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో చేర్ల కోటయ్య, కళ్లెం సీతయ్య, గంధం గణేష్, సిరిగిరి కుల్లాయి, వాచేపల్లి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రెండు మట్టి ట్రాక్టర్లు, బెల్ట్ దుకాణం సీజ్

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడులో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. అలాగే, పెదతండాలో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాప్‌ను కూడా సీజ్ చేసి వేణుగోపాల్‌పై కేసు నమోదు చేశారు.

నాలుగు సెల్‌ఫోన్ల అప్పగింత



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ట్రైనీ ఐపీఎస్ మౌనిక

ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న నలుగురి ఫోన్లను పోలీసులు సోమవారం తిరిగి అప్పగించారు. సీఐఆర్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదుతో సెల్‌ఫోన్లను గుర్తించి యజమానులకు అప్పగించినట్లు ట్రైనీ ఐపీఎస్ పి.మౌనిక, ఎస్ఐ రామారావు తెలిపారు.

రూ.1.45లక్షల నగదు సీజ్

ఖమ్మంక్రైం: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,45,400 నగదును సీజ్ చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపారు. ఓ వ్యాపారి గాంధీచౌక్ నుండి నగదు తీసుకెళ్తుండగా తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అలాగే, ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి నిజాంపేటలో బెల్ట్‌షాపులో రూ.2,900 విలువైన మద్యం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన బొలేరో.. ముగ్గురికి గాయాలు

కారేపల్లి: ఆటోను గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొట్టగా ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని కారేపల్లి క్రాస్ వద్ద సోమవారం జరిగింది. కొత్తతండా గ్రామానికి చెందిన అజ్మీరా భీముడు, భార్య మారోని, కుమారుడు నాగరాజు తమ సొంత ఆటోలో వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో కారేపల్లి క్రాస్ నుంచి సిలిండర్లతో ఎదురుగా వస్తున్న బొలేరో వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడ భీముడికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే, మారోని, నాగరాజు సైతం గాయపడగా 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పెనుబల్లి మండలంలో ఎక్సైజ్ తనిఖీలు

పెనుబల్లి: ఖమ్మం ఎక్సైజ్ అధికారి కరుణశ్రీ ఆధ్వర్యాన సోమవారం పెనుబల్లి మండలంలోని పెనుబల్లి, కల్లూరు, రాళ్లబంజర్, లక్ష్మీపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రాళ్లబంజర్ శివారు గుడుంబా స్థావరాలపై దాడులు చేసి నాటుసారా స్వాధీనం చేసుకుని, పానకాన్ని ధ్వంసం చేశారు. ఈఘటనలో లక్ష్మీపురానికి చెందిన బానోతు రమేష్‌పై కేసు నమోదు చేశారు. అలాగే, వీఎం బంజర్ బస్టాండ్ ఎదురుగా కూల్‌డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టిన అధికారులు మద్యాన్ని స్వాధీనం చేసుకుని దుకాణం యజమానిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఉద్యోగులు మధు, విశ్వనాథం, నరేష్, నిర్మల పాల్గొన్నారు.

పోక్సో కేసులో అరెస్ట్

మధిర: మైనర్ బాలికను ప్రేమ పేరుతో బయటకు తీసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు కాగా, మధిర టౌన్ పోలీసులు సోమవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఘటనపై తల్లిదండ్రుల చేసిన ఫిర్యాదుతో బోళ్ల నాగరాజుపై మార్చి 18న మధిర టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మధిర సీఐ మధు తెలిపారు.